


**12న జరిగే దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
### నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 11 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 04


# ఓటర్లపై నోట్ల వర్షం

**ఓటుకు రూ.2వేల నుండి రూ.10వేలు పంపిణీ**

**మున్సిపల్ ఎన్నికల్లో ఆయా పార్టీల నుండి పోటీచేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు మునుపెన్నడూ లేని విధంగా గెలుపే లక్ష్యంగా ఓటర్లపై నోట్ల వర్షం కురిపిస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు గత వారం రోజులుగా మందు, విందులను పెద్దఎత్తున ఏర్పాటు చేయడంతోపాటు నేరుగా ఇంటింటికి వెళ్ళి ఓటర్‌ను కలిసి మాంసం, మద్యాన్ని పంపిణీ చేశారు. ఎన్నికల పోలింగ్‌కు కేవలం కొన్ని గంటలు మాత్రమే ఉండడంతో చివరి అస్త్రంగా డబ్బుల పంపిణీ చేయడం మొదలుపెట్టారు. ఎవరికి వారు 'తగ్గేదేలే'దని పుష్ప సినిమాలో అల్లు అర్జున్ డైలాగ్‌లు కొడుతూ ఓటుకు రూ.2వేల నుండి రూ.10వేల వరకు పంపిణీ చేస్తున్నారు.**



ప్రజాపక్షం/సూర్యాపేట : మున్సిపల్ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీల నుండి పోటీ చేసిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి పార్టీల బడా నాయకులు రంగంలో దిగి ఓటర్‌ను ఎలాగైనా తమవైపుకు తిప్పుకునేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్ నాడిని పసిగట్టిందుకు ఎన్నడూ లేనివిధంగా మద్యం, మాంసం పంపిణీతోపాటు విందుల ఏర్పాటు చేయడం, ఓటుకు రూ.2వేల నుండి రూ.10వేల వరకు ఇవ్వడం జరుగుతుంది. కొందరు ఒప్పుకోకుంటే మరికొంత డబ్బును పెంచి ఇస్తున్నారు. జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలు ఉండగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత ఏ మున్సిపాలిటిలో కూడా కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోలేదు. నేడు అధికారంలోకి రావడంతో మున్సిపల్ ఎన్నికల్లో తమదే పైచెయ్యి కావాలని జిల్లాకు చెందిన రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముందు నుండే పావులు కదుపుతున్నారు. జిల్లాలో మొత్తం 4 అసెంబ్లీ స్థానాలు ఉండగా గత ఎన్నికల్లో కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, సూర్యాపేట నియోజక వర్గంలో బిఆర్ఎస్ నుండి పోటీ చేసిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి గెలుపొందారు. నేటికి నియోజక వర్గంలో ఆ పార్టీ బలంగా ఉంది. సూర్యాపేట పట్టణ ఓటర్లు అధికంగా అటు వైపే ఉన్నారు. దీంతో అధికార కాంగ్రెస్ ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలిచి సూర్యాపేట మున్సిపాలిటీపై జెండా ఎగురవేయాలని నాయకులు కృతనిశ్చయంతో ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కూడా చైర్మన్ పీఠాన్ని ఆర్యవైశ్య కమ్యూనిటికి చెందిన బడా కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్ష్మాది సతీమణి నివేదితను రంగంలోకి దింపారు. పార్టీ బలంతోపాటు చైర్మన్ అభ్యర్థి ఆర్థికంగా బలంగా ఉండడంతో కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికల బరిలో నిలిచిన గెలుపే లక్ష్యంగా ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిలలో ఓటర్లకు రూ.2వేల నుండి రూ.3వేల వరకు పంపిణీ చేస్తుండగా, సూర్యాపేటలో మాత్రం ఓటుకు రూ.2వేల నుండి రూ.10వేల వరకు పంపిణీ చేస్తున్నారు. దీనికితోడు మందు, విందు ఏర్పాట్లతోపాటు ఇంటింటికి మాంసం, మద్యం బాటిళ్ళను అందజేస్తున్నారు. అధికార పార్టీని ఈ ఎన్నికల్లో ఎలాగైనా ఓడించాలని ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బిఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు కంకణం కట్టుకున్నారు. వారికంటే మేమేమి తక్కువ కాదని తగ్గేదే లేదంటూ ఓటర్లకు మద్యం, మాంసం, డబ్బు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఓటర్లు పండుగ చేసుకుంటున్నారు.

# రక్త సంబంధంపై కసాయి కన్ను

**సొంత పెదనాన్న కూతురిపై అత్యాచారం**

**వెంట రాకుంటే చంపుతానని బెదిరింపులు**

**అత్యాచార యువకుడిని కఠినంగా శిక్షించాలని బాధిత బాలిక తల్లిదండ్రుల వేడుకోలు**

ప్రజాపక్షం/నకిరేకల్ (శాలిగౌరారం): సభ్య సమాజం తలదించుకునేలా ఓ మైనర్ బాలికల పై అదే గ్రామానికి చెందిన సొంత బాబాయ్ కుమారుడు అత్యాచారం చేసిన సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఓగ్రామం లో ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది.బాధిత బాలిక తల్లితండ్రులు చెప్పిన వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన తమ కూతురు పై గత నెల 20 తేదీ న మధ్యాహ్నం సమయంలో సొంత బాబాయ్ కుమారుడు వరసకు అన్న అయ్యే యువకుడు బలవంతంగా అత్యాచారం చేడు. దీంతో ఆ బాలిక తమ అమ్మ, నాన్నకు చెప్పింది.ఈ విషయం విన్న బాలిక తల్లిదండ్రులు వెంటనే పెద్దమనుషులకు తెలుపగా వారు ఇరువురి కుటుంబాలను పిలిపించి ఇప్పటి నుండి ఎవరి జోలికి ఎవరు పోకూడదని తీర్మాణం చేశారని సమాచారం.తదానంతరం ఆ యువకుడు నుండి బాలికకు హాని ఉందనే భయంతో ఆ బాలికను తమకు తెలిసిన చుట్టాల దగ్గరికి పంపించారు. సోమవారం రోజు ఆబాలికను ఆ గ్రామానికి తీసుకొచ్చారు. ఆ విషయం గమనించిన ఆ యువకుడు అదే రోజు రాత్రి ఆ బాలిక ఇంటికి వెళ్లి తన వెంట బాలికను రమ్మని,లేనిచో అందరిని చంపుతానని కత్తులతో హల్ చల్ చేసాడని సమాచారం. మంగళవారం బాలిక తల్లిదండ్రులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సొంత తమ్ముని కుమారుడు నాకుమార్తెను భయభ్రాంతులకు గురిచేసి నాకూతుర్ని అత్యాచారం చేసి, ఆమె భవిష్యత్తుని నాశనం చేశాడని, నిన్న రాత్రి సమయంలో కత్తుల తో మా ఇంటికి వచ్చి మమ్మల్ని మా కూతుర్ని చంపుతానని భయభ్రాంతులకు గురిచేసాడని అతని వల్ల మాకు, నామా కూతురికి ప్రాణభయం ఉందని, అతని నుండి మమ్మల్ని రక్షించి,మా బిడ్డకు న్యా యం చేయాలని ప్రభుత్వాన్ని,అధికారుల ను వేడుకున్నారు

ఫిర్యాదు అందింది..పోక్సో చట్టం నమోదు : గ్రామంలో జరిగిన ఘటనపై బాధిత కుటుంబం ఫిర్యాదు చేసినట్లు శాలిగౌరారం హెడ్ కానిస్టేబుల్ నజిరుద్దీన్ తెలిపారు.బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.




## పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ మున్సిపాలిటీ 48 వార్డుల్లో ఉన్న 93,020 ఓటర్లకు ఎన్నికలు నేడు నిర్వహించేందుకు 779 మంది అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు గాను కార్లు, బస్సులకు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ జెండా ఊపారు. వారితో పాటు సుమారు ఆరుగురు సీఐలు, 21 మంది ఎస్ఐలు, 51 మంది ఏఎస్ఐలు, 120 కానిస్టేబుళ్లు, 75 మంది హోంగార్డులు, 31 మంది మహిళా కానిస్టేబుళ్లు మొత్తం 330 మంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వాహనాలకు డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు పచ్చ జెండా చూపగా తరలివెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీఈఈ వెంకన్నలు ఉన్నారు.

## నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యం

ప్రజాపక్షం/నల్లగొండ : జిల్లా ప్రజలకు నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పనిచేస్తుందని విద్యుత్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ తెలిపారు. నల్లగొండని విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని మొత్తం 50 సబ్‌స్టేషన్లకు మంజూరు చేయగా అందులో 13 సబ్‌స్టేషన్లు పూర్తయ్యాయని,మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో విద్యుత్ మెటీరియల్ సరఫరా విషయంలో ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రారంభించిన ప్రజాబాట కార్యక్రమం ద్వారా విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమం ద్వారా ప్రజలకు విద్యుత్ శాఖ మరింత చేరువవుతుందని,సేవల్లో పారదర్శకత పెరుగుతుందని శివాజీ తెలిపారు.





## మున్సిపల్ పోలింగ్‌కు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని సిసిఆర్ విద్యానిలయంలో పంపిణీ కేంద్రం నుంచి ఎన్నికల అధికారులు మంగళవారం పోలింగ్ సామాగ్రిని ఆయా కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సూర్యానారాయణ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 491 మంది సిబ్బంది, పివో, ఎపివో, ఓపివో విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన బూత్‌లకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సుమారు 200 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పట్టణమంతా పోలీస్ పహారాలో ఉందని స్పష్టం చేశారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## పుల్లయ్య మృతదేహం చెరువులో లభ్యం



**ప్రజాపక్షం/త్రిపురారం:** నిడమనూరు మండలం లోని ముకుందపురం వద్ద సాగర్ ఎడమ కాలువలో ప్రమాదవశాతు గత మూడు రోజుల క్రితం కారు పల్టి కొట్టింది. దీంతో డ్రైవర్ ప్రాణాలతో బయటపడగా త్రిపురారం మండలంలోని కంప సాగర్ గ్రామానికి చెందిన తల్లంపుల్లయ్య పద్మలు, కారులో ఉండి మునిగి చనిపోయారు.దీంతో పోలీసులు ఎడమ కాలువ నుంచి కారును బయటకు తీయగా పద్మ మృత దేహం లభ్యమయింది. పుల్లయ్య మృతదేహం లభించక పోవడంతో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు గత రెండు రోజులుగా శవం కోసం వెతికారు.మంగళవారం త్రిపురారం మండల పరిధిలోని పెద్దదేవులపల్లి రిజర్వాయరులో తల్లంపుల్లయ్య మృతదేహాన్ని గుర్తించారు.అనంతరం పోస్టుమార్టం పంపించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

## లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** విద్యార్థులు లక్ష్యంతో ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ అమలులో భాగంగా ఫలితాల మెరుగుదల పై ఐక్యూఏసి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫసర్ జి.శ్రీనివాస్,ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాసాచారి,వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు ప్రవీణ్ రెడ్డి,హరిత, మధుసూదన్ రెడ్డి,డాక్టర్ శంకర్,నర్సింహాచారి, శివశంకర్,రవీందర్,ఉపేందర్,సుభాషిణి పాల్గొన్నారు.



## పులి రాలేదు..పుకార్లు నమ్మకండి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** శాలిగౌరారం మండలం ఇటుకులపాడు ప్రాంతంలో,అలాగే నకిరేకల్ నుంచి నల్లగొండ మండలం దండంపల్లి ఏరియాలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు కొందరు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు,వీడియోలు,చిత్రాలను వైరల్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈప్రచారం పూర్తిగా అవాస్తవమని ఫారెస్ట్ అధికారులు స్పష్టం చేశారు. ఈవిషయమై ఫారెస్ట్ ఆఫీసర్ అశోక్ రెడ్డి,శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డిని సంప్రదించగా,మన జిల్లా పరిధిలో గానీ,శాలిగౌరారం,నకిరేకల్,నల్లగొండ ప్రాంతాల్లో గానీ పెద్దపులి సంచరిస్తున్నట్లు ఎలాంటి సమాచారం లేదా ఆనవాళ్లు లేవని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిత్రాలు, వీడియోలు ఫేక్ అని పేర్కొన్నారు. ఫారెస్ట్ ఆఫీసర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పెద్దపులి సంచారం భువనగిరి నుంచి జనగాం,అక్కడి నుంచి సిద్దిపేట ఏరియాలో మాత్రమే ఉన్నట్లు సమాచారం ఉందని తెలిపారు.మన జిల్లాలో ఎక్కడా పెద్దపులి సంచారం లేదని,ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మవద్దని, అధికారిక సమాచారం మేరకే స్పందించాలని ప్రజలను కోరారు. ఎవరు ఇలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు చెప్పారు.

## బిసి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో జనరల్, బీసీ రిజర్వ్ స్థానాల్లో నిలబడిన బీసీ అభ్యర్థులందరికి కూడా ఏకగ్రీవంగా ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీ గురించి గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడినా ఫలితం దక్కలేదన్నారు. మొదటి నుంచి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీ రిజర్వేషన్లపై నీరు కారుస్తూనే ఉన్నాయన్నారు. పార్టీలకతీతంగా బీసీలను అత్యధిక మెజారిటీతో గెలిపించి బీసీ ఉద్యమానికి మరోసారి నాంది పలకాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్లు దక్కాల్సి ఉండగా అగ్రకుల నాయకులు కావాలని కోర్టుకెక్కి రిజర్వేషన్ తగ్గించిన సంగతి గుర్తుంచుకోని వారికి తగిన బుద్ది చెప్పాలన్నారు. కార్యక్రమంలో కర్నాటి శివరామకృష్ణ, నాగరాజు, శ్రీ కాంత్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటికి నేడు జరగబోయే ఎన్నికల కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలో ఉన్న మొత్తం 12 వేల 118 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. అందులో 5929 మంది పురుషులు, 6188 స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 12 కౌన్సిల్ వార్డులకు గాను మొత్తం 24 పోలింగ్ బూత్‌లను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. వీటి కోసం 24 మంది ప్రిసైడింగ్ అధికారులతో పాటుగా మరో 24 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 72 మంది పోలింగ్ సిబ్బంది తమ విధులను నిర్వర్తించనున్నారు. సమస్యాత్మకంగా ఉన్న 13 బూత్‌లలో అదనపు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. ఎన్నికల పర్యవేక్షకులు రమేష్ ఎంపిడివో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బాక్స్‌ల పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మాత్తుగా పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి అందిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ దండు శ్రీను, మాస్టర్ ట్రైనర్ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

## వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** వరిలో డ్రం సీడర్, వెదజల్లే పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని గడ్డిపల్లి కెవికె శాస్త్రవేత్త ఎ.కిరణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో నేరుగా విత్తే వరిసాగు శిక్షణపై వివరించారు. ఈ కార్యక్రమం ఐసిఏఆర్ భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్), రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), సిఎస్ఆర్ ఫండ్ సహకారంతో నిర్వహించినట్లు తెలిపారు. వరి సాగుకు అనుకూలమైన నేల రకాలు, విత్తన రకాలు, ఎరువుల మోతాదులు, చీడపీడల నిర్వహణ, నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు నియంత్రణ పద్ధతులపై వివరించారు. రైతులకు కలుపు నివారణ కోసం




టైఫామెన్, ఎథోక్సిసల్ఫ్యూరాన్ మందును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఆర్ఆర్ సంస్థ రిసెర్చ్ అసోసియేట్ డాక్టర్ కె. కవిరాజు, కెవికె శాస్త్రవేత్తలు ఆదర్శ్, అక్షిత్‌సాయి, నరేష్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ సాయికిరణ్, కె. అజయ్, రైతులు దొంగరి అరవింద్, బిట్టు వెంకన్న, పి. అంజయ్య పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు వినతి

**ప్రజాపక్షం/మునగాల:** గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ రకాల ప్రభుత్వ భూములను సర్వే చేయించి హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని మండల తహసిల్దార్ సరితకు నర్సింహాపురం గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ వినతిపత్రంను మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింహపురం గ్రామంలోని గ్రామ కంఠం, అసైన్డ్ ,ఇందిరమ్మ ఇళ్ల స్థలాలకు ఇచ్చిన భూమిని సర్వే చేయించి, హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని, ఎవరికి కేటాయించని మిగిలిన ఇళ్ల స్థలాలను గుర్తించాలని, అలాగే కబరస్తాన్ స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. తహసిల్దార్ సానుకూలంగా స్పందించి త్వరలో సర్వే చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## బాల్య వివాహాలు నిర్మూలిద్దాం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** బాల్య వివాహాలను నిర్మూలించి బాలికల విద్యను ప్రోత్సహించాలని గ్రామ సర్పంచులు ఇటికాల శ్రీనివాస్ అనుములపురం నాగయ్య, సంకరమద్ది నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెన్‌పహాడ్, మాచారం, అనంతారం, అనాజీపురం, దోసపహాడ్, నాగులపహాడ్, అన్నారం, అన్నారం బ్రిడ్జి, పొట్లపహాడ్, సింగారెడ్డిపాలెం గ్రామాలలో జస్టిస్ చిల్డ్రన్, యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి సోషల్ మొబిలైజర్ వగ్గ సోమన్న, పంచాయితీ కార్యదర్శులు విద్యాధర్, జానీ, సందీప్, భవాని, శ్రవణ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## డిడబ్లుకు సమ్మె నోటీసు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కేంద్ర ప్రభుత్వం నాలుగులేబర్ కోడ్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న జరిగే సమ్మెను అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అందరూ సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం బిఆర్‌టియు యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంపటి గురూజీ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తాటిపాముల నాగలక్ష్మి అంగన్‌వాడీలకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డిడబ్లుఓ సమ్మె నోటీసు అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తూ బడ్జెట్ కేటాయింపులు తగ్గించారని, వెట్టి చాకిరి చేస్తున్న అంగన్‌వాడీలకు కనీస వేతనం ఎందుకు అమలు చేయడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కమల, లలిత, శారద, జ్యోతి పాల్గొన్నారు.

## ఫిజికల్ ఎడ్యుకేషన్ సదస్సుకు రేణుక



**ప్రజాపక్షం/మోతె :** మండలంలోని మామిళ్ళగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఈటిగా విధులు నిర్వహిస్తున్న రేణుక గోవా రాష్ట్రంలోని నావేలివ్‌లో ఫిబ్రవరి 12 నుండి 14 వరకు నిర్వహిస్తున్న ఐసిపిఎస్ఎస్2026 అంతర్జాతీయ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్స్ సదస్సుకు ఎంపిక అయినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో దేశ విదేశాల నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడా శాస్త్ర నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. రేణుక ఫిజికల్ ఎడ్యుకేషన్ రంగంలో తాజా పరిశోధనలు, నూతన బోధన విధానాలు క్రీడాభివృద్ధి అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొని తన అనుభవాలను పంచుకోనున్నారని వివరించారు. ఈ సదస్సు ద్వారా తమ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు

## తాజా పాలను సేవించండి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లో పాడి గేదెలను, పశువులను పెంచుకోవడం ద్వారా, ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు గ్రామ ప్రజలు తాజా పాలను కూడా సేవించి ఆరోగ్యకరంగా ఉంటారని గ్రామ సర్పంచ్ కడియాల పద్మ అప్పయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గానుగబండ గ్రామంలో పశువుల వైద్యానికి అనుకూలంగా ఉంచడానికి నూతనంగా ఏర్పాటు చేసిన బోనును ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సయ్యద్ నాగుల్‌మీరా, పంచాయతీ కార్యదర్శి శివ, గోపాలమిత్ర గోపి, వార్డు మెంబర్లు, పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.





## స్వర్ణగిరి క్షేత్రంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/భువనగిరి** : భువనగిరిలోని స్వర్ణగిరి క్షేత్రం శ్రీ స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా లక్ష్మీ నారాయణ ఇష్టిహవనం (అన్యోన్య దాంపత్యం కొరకు) శాస్త్రోక్తంగా, భక్తి భావంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ శ్రీ శ్రీ ఆళ్వార్ తిరునగరి ఎంబెరుమానార్ జీయర్ మఠం శ్రీ రంగ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సూర్యప్రభ వాహన సేవ భక్తి భావంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ పాల్గొన్నారు.

## సాంబశివుడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/వలిగొండ** : తెలంగాణ ప్రాంత భూమి, భుక్తి, విముక్తి కోసం తమ విలువైన జీవితాలను దారపోసి పోరాడిన అమరవీరుల జీవిత చరిత్రలను రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ తరాలకు అందించడానికి నిక్షిప్తం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెంలో తెలంగాణ ఉద్యమ పోరాటయోధులు కొనపురి సాంబశివుడు, రాములు తల్లి లక్ష్మమ్మ నిన్న ఆకస్మికంగా మరణించగా దాసిరెడ్డిగూడెంలో లక్ష్మమ్మ చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ సహచర బీసీ ఉద్యమ నేతలతో కలిసి లక్ష్మమ్మకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోనపురి కవిత, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి, వలిగొండ పట్టణ అధ్యక్షుడు నానంచర్ల రమేష్, నారి మల్లేష్ ఉన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

**ప్రజాపక్షం/బీబీనగర్** : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు మంగళవారం బీబీనగర్ మండల కేంద్రంలో ఐకెపి మండల సమైక్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్బిఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేవైసీ చేసుకోవడం వల్ల సురక్షిత బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవచ్చు అన్నారు. అంతేకాకుండా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ కేవైసీ యొక్క ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కే.శివరామకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాగీరుద్దీన్, డిపిఎం వెంకటేశం, ఏటీఎం మీనా, వివిధ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



## బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీ లింగ బసవేశ్వర స్వామి ఆలయం

### నేటి నుండి మూడు రోజులపాటు స్వామి వారి ఉత్సవాలు



**ప్రజాపక్షం/బీబీనగర్** : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పడమటి సోమవారం గ్రామంలో వెలిసిన శ్రీ లింగ బసవేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నేడు కళ్యాణం,12న రాత్రి అగ్నిగుండాలు, రథోత్సహం అత్యంత వైభవంగా ఉత్సాహాలు నిర్వహించేందుకు భువనగిరి ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి ఉత్సవ కమిటీ ఆలయ చైర్మన్ సంది గారి బసవయ్య ఆధ్వర్యంలో ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో పచ్చటి మామిడి తోరణాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం యాదగిరిగుట్ట, ఉప్పల్ డిపో నుండి భక్తుల సౌకర్యార్థం 24 గంటల బస్సు సౌకర్యం కల్పిస్తూ అదేవిధంగా బ్రహ్మోత్సవాల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పి ఆకాంక్ష యాదవ్, డీఎస్పీ రవీందర్, సిఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ఉత్సవాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి ఆర్డీవో ఏం.కృష్ణారెడ్డి, ప్రారంభించినట్లు ఆలయ ఈవో గోలి నరేందర్ రెడ్డి తెలిపారు.

## అసంపూర్తి శ్మశాన వాటికను పూర్తి చేయండి



**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ మండలంలోని కదిరేణిగూడెంలో గత నాలుగు సంవత్సరాలుగా శ్మశాన వాటిక నిర్మాణం పనులు పూర్తి కాక అసంపూర్తిగా ఉండడంతో మృతుల కుటుంబ సభ్యులు శ్మశాన వాటిక స్నానాల గదులు శవ పేటికలు సరియైన రీతిలో ఉపయోగించుకోలేక అనేక అవస్థలు పడుతున్నారని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని త్వరగా నిర్మాణం పనులు పూర్తి చేయించాలని ఆ గ్రామ సర్పంచ్ జెట్ట లత మహేశ్వర్ అధికారులను కోరుతున్నారు. కాంట్రాక్టర్ వేముల స్వామి శ్మశాన వాటిక నిర్మాణం కోసం డబ్బులు అడ్వాన్స్ తీసుకొని ఇంతవరకు పూర్తి చేయలేదని, వేముల స్వామిని విచారించగా ఎంబి కాలేదని పూర్తిగా డబ్బులు రాలేదని సాకులు చెబుతూ నాలుగు సంవత్సరాల నుంచి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అప్పటి ఎంపీడీవో కదిరేనిగూడెంలో స్మశాన వాటిక నిర్మాణం కోసం ఏడున్నర లక్షలు అడ్వాన్స్‌గా ఇవ్వడం జరిగిందని, గ్రామపంచాయతీ నుంచి 2 లక్షల 60 వేల రూపాయలకు ఎంబి చేసినట్లు తెలిపారు. శ్మశాశాన వాటికలో ఇంకా బాత్రూమ్‌లలో టైల్స్, ప్లంబింగ్ వర్క్, రూమ్స్‌కి డోర్లు, ఫెన్సింగ్, గేట్, నీటి సౌకర్యం లాంటి మరమ్మతులు చేయాలని కోరారు.

## పేద ప్రజలకు అండగా షిలోహు మినిస్ట్రీస్



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** పేద ప్రజలకు అండగా షిలోహు మినిస్ట్రీస్ సేవలను ఎల్లప్పుడు కొనసాగిస్తుందని కొండమల్లేపల్లి షిలోహు మినిస్ట్రీస్ పాస్టర్ దేవకుమార్ అన్నారు. మంగళవారం చర్చి ఆవరణలో ఆశ్రయం హాండ్స్ ఆఫ్ హోప్ వారి ద్వారా మండల పరిధిలోని సుమారు 500 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. గర్భిణిలు, బాలింతలకు రక్త పరీక్షలు, అవసరమైన వారికి ఎక్స్‌రే ఈసిజి, షుగర్, బిపి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి ఉచితంగా కళ్లజోడులను అందజేశారు. ఈకార్యక్రమంలో వైద్య సేవల పర్యవేక్షకులు ఎడ్వార్డ్ విద్యాసాగర్, ప్రమీల, సామ్యూల్, కృప, శ్యాంసన్, సదానందం, వైద్య బృందం విజయ్, అనూష, భవాని, చింటూ, ఈశ్వరమ్మ, పద్మావతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నిర్ధారణ శిబిరం



**ప్రజాపక్షం/అర్వపల్లి** : మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో టిబి ఆక్టివ్ కేసు నిర్ధారణ శిభిరంను వైద్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ నగేష్ మాట్లాడుతూ 10 మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని ఎవరికైనా టిబి వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే సకాలంలో గుర్తించి చికిత్స అందజేస్తామన్నారు. క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేసి 2027 వరకు భారతదేశం నుండి పూర్తిగా నిర్మూలించాలని కోరారు. ఎవరికైనా క్షయ లక్షణాలు ఉన్నట్లయితే స్థానిక ఆశ కార్యకర్తలను, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిబి నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, గౌతమి, నాగమ్మ, లిల్లి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మన్నె లక్ష్మీనర్సయ్య యాదవ్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం/అర్వపల్లి** : బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంచమర్తి గ్రామ సర్పంచ్‌గా పలుమార్లు పని చేసిన వ్యక్తి ఆయన భార్యను మండల ఎంపిపిగా ఎన్నిక చేసి ప్రజల్లో మంచి నాయకుడిగా పేరు పొందిన మన్నె లక్ష్మీనర్సయ్య యాదవ్ అకాల మరణం చెందారు. ఈ సందర్భంగా సిపిఎం, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన భౌతిక దేహంపై పూలమాలలు వేసి ఆయన కుటుంబాలను పరామర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, కొలిశెట్టి యాదగిరి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.



## మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. మొత్తం వార్డులు 48 ఉండగా పోలింగ్ స్టేషన్లు 165 ఉండగా 63 సమస్యాత్మక బూతులు ఉన్నాయన్నారు. ఇందులో పిఓలు 165, ఏపిఓలు 165, ఓపిలు బూత్‌కు ముగ్గురు (3) చొప్పున 495, మైక్రో అబ్జర్వర్ల బూత్ ఒక్కంటికి 165, వీరితోపాటు మున్సిపల్ వార్డు అధికారి, బియల్ఓ, పోలీసు, ఆశా వర్కర్లు నియమించినట్లు తెలిపారు. 16 మంది రూట్ ఆఫీసర్లు, 40 మంది ఆర్ఓ, ఏఆర్ఓలతోపాటు, మున్సిపల్ అధికారులు సిబ్బంది ఎన్నికల పనులలో నిమగ్నం అయ్యి ఉన్నారని చెప్పారు.

## 16న కర్ల రాజేష్ సంతాప సభ



**ప్రజాపక్షం/అర్వపల్లి** : ఈనెల 16న అర్వపల్లి మండల కేంద్రంలో జరగబోయే కర్ల రాజేష్ సంతాప సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి కందుకూరి సోమన్న పిలుపునిచ్చారు. మంగళవారం అర్వపల్లి మండల కేంద్రంలో జరిగిన ఎంఆర్‌పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 నవంబర్ 16న కోదాడలో లాకప్‌డెత్‌కి గురైన రాజేష్ మృతిపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈనెల 16న సాయంత్రం 5 గంటలకు జరగబోయే సంతాపసభకు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈదురు వీరపాపయ్య, గడ్డం ఖాసీం, పాల్వాయి పరుశురామ్, కొండగడుపుల శ్రీను, రవి, మచ్చ నర్సయ్య పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయికి విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/వలిగొండ** : యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలలో భాగంగా శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల వలిగొండకు చెందిన క్రీడాకారులు కబడ్డీ విభాగంలో ఎస్.నవ్య, ఏ.జైపాల్, ఎం.దీక్షిత, క్యారమ్స్ విభాగంలో బి.వర్ధన్ రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్.భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు జి.స్వామి రాజు, ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడలలో మంచి భవిష్యత్తు ఉందని ప్రతి విద్యార్థి క్రీడలలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పి.నాగేందర్, సైదారెడ్డి, జిలాని, మల్లేష్, లింగయ్య, స్వామి, శివాజీ, ఉపాధ్యాయ బృందం క్రీడాకారులను అభినందించారు.

## ప్రపంచ పప్పు ధాన్యాల దినోత్సవం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని రామారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ పప్పు ధాన్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పప్పు ధాన్యాల ఉపయోగాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. పప్పు ధాన్యా లు తీసుకోవడం వలన శరీరానికి పోషకాలు, ప్రోటీన్లు సంవృద్ధిగా లభిస్తాయని అన్నారు.

## గట్టి బందోబస్తు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : నేడు జరగనున్న పోచంపల్లి మున్సిపాలిటీ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటు వేసే వాళ్లు గాని, ఏజెంట్‌గా కూర్చునే అభ్యర్థులు గాని ఎలాంటి ఎలెక్ట్రోనిక్ వస్తువులు గాని, మొబైల్ ఫోన్, పెన్స్, వాచ్, వాటర్ బాటిల్‌లను లోనికి తీసుకొని రాకూడదు. 100మీ లైన్ డిస్టెన్స్ బయటే పెట్టి, పోల్ చిట్టి, ఐడి ప్రూఫ్ మాత్రమే తీసుకొని రాగలరు. నియమాలు అందరూ పాటించి ప్రశాంత ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## సమ్మె నోటీసులు



**ప్రజాపక్షం/గుండాల;** ఫిబ్రవరి 12న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొంటారని తెలియజేస్తూ మంగళవారం గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడివో చంద్రీరాణి, ఎంపివోలకు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో జేఏసి నాయకులు ఇటికల పరుశురాములు, గిరి, యాదయ్య, ఇందిర, వెంకటేశం, ఎల్లయ్య, రాజు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కళ్ళు ప్రధానం



**ప్రజాపక్షం/వేములపల్లి:** ప్రపంచాన్ని చూడాలంటే కళ్ళు చాలా ప్రధానమని అంబేద్కర్ అధ్యక్షుడు పుట్టల మధు అన్నారు మంగళవారం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఎంతోమంది పౌష్టికాహారం లేక అనేక కారణాల వల్ల కంటి చూపును కోల్పోవడం ప్రపంచాన్ని చూడలేకపోవడం చాలా బాధాకరమైన అన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు పండు,వంశీ,కిరణ్ వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయానికి అనిల్ శాశ్వత నిధి అందజేత

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి** : మండలకేంద్రంలోని శ్రీవారి జాల వేణుగోపాలస్వామి దేవాలయ అభివృద్ధి కొరకు భక్తులు తమవంతుగా ఆర్థికంగా, వస్తురుపేనా సహాయ సహకారలు అందిస్తున్నారు.ఇందులో భాగంగా మంగళవారం పట్టణానికి చెందిన జమాల్ పురం అనిల్ కుమార్ ఆలయ శాశ్వత నిధికి రూ.50020 ఆలయ ధర్మకర్తకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐతరాజు రమేష్,జాల రమేష్,అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రచయిత వెంకటదాస్‌కు గౌరవంతో సహాయం



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : రచయితలను గుర్తించి వారిని ఆదుకోవడం అభినందనీయం రచయితలను గుర్తించి వారిని ఆదుకోవడం అభినందనీయమని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో కరుణా క్లినిక్ ఆవరణలో భువనగిరి మండలం బిఎన్ తిమ్మపురం గ్రామానికి చెందిన మెరుగు వెంకట దాస్‌కు, మౌలాలి జవహర్ నగర్‌కు చెందిన గుడి గంటల రాములు ప్రతి సంవత్సరం మాదిరిగా 20 సంవత్సరాలుగా సంవత్సరానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని రచయితపై గౌరవంతో సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో చాగంటి మహేష్, పోతరబోయిన జహంగీర్, పి.రాము, ఏ.వెంకటేష్, కొత్త ప్రణయ్ రెడ్డి, తునికి అశోక్ పాల్గొన్నారు.

## భూమి సమస్యపై విచారణ చేపట్టాలని, తహసీల్దార్, ఎంపిడిఓలకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణం కోసం కేటాయించిన సర్వే నంబర్ 77లోని 150 గజాల స్థలంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజలందరి సమక్షంలో చేసిన తీర్మానాన్ని ధిక్కరించి, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నట్లు సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ తన పాలక వర్గ సభ్యులు గ్రామ పెద్దలతో కలిసి తుర్కపల్లి మండల తహసీల్దార్ జల కుమారికి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గీతా రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కాపాడాడు కోవాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులుగా తమపై, అధికారులపై ఉన్నదని తెలిపారు. వెంటనే సంబంధిత విషయం పై పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రభుత్వ అధికారుల సంతకాలను స్టాంపులను ఫోర్జరీ చేసి, అట్టి స్థలంలో హద్దురాళ్లు లేకున్న ఉన్నట్లు ఫోటోలలో సృష్టించి, కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నపై వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విచారణ జరిపి మహిళా సంఘం భవన నిర్మాణంకు కేటాయించిన స్థలాన్ని విముక్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్, వార్డు మెబర్లు నల్ల రాజు, ధ్యాన బోయిన నవీన్, గుంటి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్యాన బోయిన బొందయ్య, గుంటి మల్లేష్ యాదవ్, ధ్యాన బోయిన పోచయ్య ఉన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీ : ఇద్దరికీ తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని రామ్ రెడ్డి పల్లి శివారులో మర్రిగూడ మాల్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం మంగళవారం జరిగింది. చండూరు నుంచి హైదరాబాద్ (రాణిగంజ్ )వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అన్న చెల్లెలు సూరు రేణుక,మోర శివ,వీరు ద్విచక్ర వాహనంపై మాల్ నుంచి కనగల్ మండలం బుడమర్లపల్లి గ్రామానికి వెళ్తుండగా రామ్ రెడ్డి పల్లి గ్రామ శివారు లోకి రాగానే ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం వీరిని ఢీకొట్టింది.ఈప్రమాదంలో రేణుక,శివలకు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తము నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. సారంపేట గ్రామానికి చెందిన ఈద స్వామి,స్వప్నలకు స్వల్ప గాయాలతో మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు.ప్రమాద సమయంలో వాహనాలపై ఉన్న ఇద్దరు చిన్నారులు త్రుటిలో ప్రాణాపాయం ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.ద్విచక్ర వాహనాలు పూర్తిగా నుజ్జునుజయ్యాయి.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి బొలెరో డ్రైవర్ నిర్లక్ష్యంపై విచారణ జరుపుతామన్నారు.



## లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులు

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు బిఆర్ఎస్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కోనపురి సాంబశివుడు రాష్ట్ర నాయకుడు కోనపురి రాములు మాతృమూర్తి కోనపురి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మాజీ ఎంపీటీసీ బచ్చగొని గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## 20 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మున్సిపాలిటి ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 20 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేటాయించిన సిబ్బంది పోలింగ్ ఆఫీసర్లు, సెక్యూరిటి సిబ్బంది మంగళవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. నేడు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

## 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్‌టిసి ను జయప్రదం చేయాలని కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి ఎన్ఆర్‌సి రాజు, ఎస్‌డబ్ల్యాయు రీజియన్ కార్యదర్శి యార చంద్రయ్య, ఎస్‌డబ్ల్యాఎఫ్ జిల్లా అధ్యక్షులు కందుల నర్సింహ, డిపో కార్యదర్శి గులాం రసూల్ విజ్ఞప్తి చేశారు. కార్మికుల కుటుంబాలను వీధిపాలు చేసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం బరితెగించి నూతనంగా నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు.తక్షణమే లేబర్ కోడ్ లను రద్దుచేసి పాత చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే టిఎస్ ఆర్‌టిసిలో అమలవుతున్న కార్మికసంఘ కార్యకలాపాల నిషేధం కార్మికులపై వేధింపులు,పనిష్మెంట్లు,8గంటల డ్యూటీలు 1216 గంటలతో పనిభారం విద్యుత్ బస్సులు, అవుట్ సోర్సింగ్ అమలుకు వ్యతిరేకంగా కార్మికులంతా సమ్మెలో పాల్గొనాలన్నారు.

### మర్రిగూడలో బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఫిబ్రవరి12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ సంస్థలు మంగళవారం మర్రిగూడలో బైక్ ర్యాలీ నిర్వహించారు.సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను, విద్యుత్ సవరణ చట్టాలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ర్యాలీలో పలు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ యాప్ రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నిడమనూరు:** రైతులకు యూరియా అందించేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకు వచ్చిన ఫర్టిలైజర్ యాప్ రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నిడమనూరు మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ యూరియా స్లాట్ బుకింగ్ విషయంలో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆన్లైన్లో పెట్టిన కొన్ని క్షణాలలోనే యూరియా బుక్ అయిపోతుండడంతో నిరక్షరాస్యులైన రైతులు స్మార్ట్ ఫోన్ అందుబాటులో లేని రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కోమాండ్ల గురువయ్య,నల్లబోతు సోమయ్య, కుంచెం శేఖర్,వెంపటి మహేష్ పాల్గొన్నారు.

## రాము, వెంకటేష్‌లను ఆదర్శంగా తీసుకోవాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపలి;** మండల పరిధిలోని కేశ్యతండాకు చెందిన రమావత్ రాము సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటి ఫోర్స్‌లో ఉద్యోగం పొందాడు. రమావత్ వెంకటేష్ ఉన్నత చదువుల కోసం లండన్ వెళుతున్న సందర్భంలో ఆ గ్రామ సర్పంచ్ రమావత్ రాజునాయక్ వారిద్దరిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో లో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సర్పంచ్ రాజునాయక్ మాట్లాడుతూ తండాలోని యువత రాము, వెంకటేష్ లను ఆదర్శంగా తీసుకొని, ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈకార్యక్రమంలో కేశ్యతండా పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, వార్డు సభ్యులు జగన్‌నాయక్, సంధ్యరాజు నాయక్, యువ నాయకులు తిరుపతి, ఉపాధ్యాయుడు ఆరోగ్యం, రవినాయక్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలం కొట్టాల గ్రామంలో శివన్నగూడెడా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ నేరాలపై మేనేజర్ విజయసింహారెడ్డి ప్రజఅవగాహన సదస్సును నిర్వహించారు. బ్యాంకు సిబ్బ ఖాతాదారుల సమాచారం అడగరని,అపరిచిత వ్యక్తు ఫోన్ చేసి ఏటీఎం పిన్,అకౌంట్,ఆధార్ నంబర్లు, ఓట్ల్ అడిగినట్లయితే వెంటనే బ్యాంకును సంప్రదించాలనా సర్పంచ్ కల్లెట్ల లింగయ్య,సిబ్బంది పాల్గొన్నారు.